క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


ఆంజనేయ స్వామివారు

సీతానగరం: మండలంలోని రామచంద్రపురంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు హనుమాన్ చాలీసాను 108 సార్లు పఠించారు. బుధవారం రామచంద్రపురం ఏటిగట్టుపై ధున్న ఆలయం వద్ద తణుకుకు చెందిన ప్రసాద్ గురుస్వామి ఆద్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి పలు రకాల హారతులు, ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వన భోజనాలను ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద రాత్రి భజన కార్యక్రమం జరిగింది.

సిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకుడికి కార్తీకమాసం ద్వాదశి సందర్భంగా బుధవారం గరికపూజ, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో కొలువైన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గరిమెళ్ల ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన సుగంధం వెంకట సత్య ప్రసాద్, సత్యవేణి దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయం వద్ద భారీఎత్తున అన్న సమారధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పల బత్తుల ఈశ్వర్, కార్యదర్శి కడియం వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

రాజానగరం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక వజ్రాయుధం వంటిదని, దానిని ప్రజాస్వామ్య పరిరక్షణకు సద్వినియోగం చేయడం ప్రతి ఓటరు బాధ్యతని డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవీవీఎస్ మూర్తి అన్నారు. స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు లభిస్తుందన్నారు. భారత రాజ్యాంగం అందించిన ఈ హక్కును మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రన్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధన


శివాలయం వద్ద అన్న ప్రసాదం స్వీకరిస్తున్న మహిళలు

రంగంపేట: మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో కొలువైన ఉమా మహేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

నీటి బొట్టు.. వృథా అరికట్టు

- తుంపర సేద్యంతో ఉద్యాన వనాల విస్తృతి
- ఖర్చు మితం.. కలుపు నియంత్రణకు మార్గం
- తెగుళ్లు, కూలీల సమస్య నుంచి విముక్తి


బూరుగుపూడిలో బిందు సేద్యం ద్వారా పామాయిల్ మొక్కకు చేరిన నీరు


మధురపూడి ఎయిర్ పోర్టు సమీపంలో బిందు సేద్యంలో సాగవుతున్న కొబ్బరి, బత్తాయి తోట

మధురపూడి: కర్షకులకు అధికాదాయం సమకూర్చే ఉద్యాన వనాలు విస్తృతం కావడానికి తుంపర సేద్యం ఎంతగానో దోహదపడుతోంది. ప్రాణ వాయువును విడుదల చేస్తూ, ఆరోగ్యకరమైన పండ్ల తోటల అభివృద్ధికి మరింత సహకారిగా ఉంటుంది. సాగునీరు వృథా కాకుండా. మొక్క మొదలుకే చేరేందుకు అవకాశం ఉంటుంది. ఒక్క నీటి బొట్టు కూడా వృథా కాకుండా జరిగే సాగు విధానమే బిందు సేద్యం. మొక్కకు జీవం అందించబడటమే కాకుండా, తెగుళ్లు నివారించబడతాయి. అదేవిధంగా కూలీల సమస్యను కూడా అధిగమించవచ్చు. దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుంది. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో ఉద్యాన వనాలు 9,100 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇందులో కొబ్బరి, మామిడి, జీడిమామిడి, పనస. బత్తాయి, నిమ్మ, జామ, బొప్పాయి, పామాయిల్ తోటలు సాగవుతున్నాయి.

రైతుకు లాభదాయకం

తుంపర సేద్యం ద్వారా ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. కలుపు మొక్కల పెరుగుదలను అడ్డుకుంటుంది. మొక్కకు జీవం నేరుగా చేరుతుంది. సాగునీరు వృథా కాకుండా, మొక్క ప్రధాన వేరు వ్యవస్థకు అందించబడుతోంది. తక్కువ ఖర్చుతో దిగుబడి పెరగడంతో పాటు, లాభదాయకంగా ఉంటుంది. నీటి కొరత నెలకొన్న ప్రాంతాల్లో సైతం మొక్కకు తుంపర సేద్యం ద్వారా జీవం అందజేయవచ్చు. మొక్క వేరు వ్యవస్థ బలోపేతం కావడంతో చెట్లు ఈదురు గాలులకు నేల రాలకుండా ఉంటాయి.

వివిధ రకాల తోటలు

రాజానగరం నియోజకవర్గంలో 9,100 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన వనాలున్నాయి. కొబ్బరి, పామాయిల్, నిమ్మ, బత్తాయి, కోకో, మామిడి, జీడి మామిడి, పనస, సపోటా, జామ, నేరేడు, బొప్పాయి తదితర తోటలు సాగవుతున్నాయి. కాగా కోరుకొండ మండలంలో 3,300 హెక్టార్ల విస్తీర్ణంలో తోటలున్నాయి. అవి మధురపూడి, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నిడిగట్ల, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, కణుపూరు, గాదరాడ గ్రామాల్లో ఉన్నాయి. రాజానగరం మండలంలో 5,400 హెక్టార్ల విస్తీర్ణంలో పండ్ల తోటలుండగా, నందరాడ, నరేంద్ర పురం, తదితర గ్రామాల్లో సాగవుతున్నాయి. అలాగే సీతానగరం మండలంలో 400 హెక్టార్ల విస్తీర్ణంలో తోటలున్నాయి.

ఆశాజనకంగా దిగుబడి

ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని చేకూర్చేందుకు పండ్లు చాలా అవసరం. ఈ పండ్లను అందించే తోటల విస్తరణకు బిందు, తుంపర సేద్యం ఉపయోగపడుతోంది. దీనిద్వారా పండ్ల దిగుబడి పెరుగడంతో పాటు, నాణ్యమైన పండ్ల ఉత్పత్తి జరుగుతోంది. వ్యవసాయంలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో దిగుబడి పెరగడం పండ్ల తోటల రైతన్నలకు ప్రయోజనం చేకూరుతోంది.

తెగుళ్ల నియంత్రణకు మేలైన మార్గం

ఉద్యాన వనాలకు బిందు, తుంపర సేద్యం ద్వారా తెగుళ్ల నియంత్రించబడతాయి. కలుపు మొక్కల విస్తరణను అడ్డుకుంటుంది. కలుపు మొక్కలు పెరగడం ద్వారా కూలీలను ఏర్పాటు చేసి తొలగించాల్సి ఉంటుంది. అయితే తుంపర సేద్యంతో కూలీల సమస్యలు ఉత్పన్నం కావడానికి అవకాశం ఉండదు. కూలీల సమస్యలను అధిగమించేందుకు వీలుంటుంది.

రాయితీలతో విస్తరణ



పండ్ల తోటలను విస్తరించడానికి ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది. ఆకర్షణీయమైన రాయితీల కారణంగా రైతులు బిందు సేద్యానికి మొగ్గు చూపుతున్నారు. ఐదు ఎకరాల లోపు పండ్ల తోటలున్న రైతులకు 90 శాతం, ఐదు ఎకరాలకు మించిన తోటలున్న రైతులకు 50 శాతం రాయితీలు లభిస్తాయి.

– రిని, ఉద్యానవన శాఖాధికారి, కోరుకొండ

మరిన్ని రాయితీలు ప్రకటించాలి



ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఉద్యానవనాలు విస్తృతం కావడానికి మరిన్ని రాయితీలను ప్రభుత్వం ప్రకటించాలి. చెట్టుకు నీరు నేరుగా చేరడానికి బిందు సేద్యంలో వీలుంటుంది. మెట్ట ప్రాంతమైన దోసకాయలపల్లి, నందరాడ, బూరుగు పూడి తదితర గ్రామాల్లో నీటిఎద్దడి ఉంది. దీనివల్ల బిందు సేద్యం ఉపయోగకరంగా ఉంది. నేను బత్తాయి, కొబ్బరి తోటల్లో దీనినే అవలంబిస్తున్నాను. బత్తాయి, నిమ్మ, జామ తదితర పండ్ల తోటల పెంపకంలో రైతులకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– కర్రి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ

రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు

డీఆర్‌డీఏ డీపీఎం వెంకటేశ్వరరావు


పెదపూడిలో యానిమేటర్లతో సమీక్షిస్తున్న డీపీఎం వెంకటేశ్వరరావు

పెదపూడి: వెలుగు కార్యాలయానికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా అమలు చేయాలని డ్వాక్రా సంఘాల యానిమేటర్లకు డీఆర్‌డీఏ డీపీఎం వెంకటేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. పెదపూడి వెలుగు కార్యాలయంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు, డ్వాక్రా సంఘాల యానిమేటర్లకు బుధవారం సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి మొదలగు నిధులను ఎంతమందికి ఇచ్చారు..రికవరీ శాతం ఏలా ఉందనే అంశాలపై ఆరా తీశారు. నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెలుగు ఏపీఎంను విచారిస్తాం

వెలుగు ఇన్‌చార్జ్ ఏపీఎం చినబాబుపై రెండు సార్లు పలు ఆరోపణలు చేస్తూ వెలసిన వాల్‌పోస్టర్ల కలకలంపై మూడు రోజుల్లో విచారణ చేపడతామని డీపీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి భవాని, ఇన్‌చార్జ్ ఏపీయం చినబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాగులో మూస విధానం శ్రేయస్కరం కాదు

పర్యావరణ వేత్త విజయ్‌రామ్


సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌రామ్

రాజానగరం: తక్కువ కాలంలో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మూస పద్ధతిలో సాగు చేయడం భూసారానికి నష్టం కలిగించడమే అవుతుందని సుభాష్ పాలేకర్ కృషి విధాన ప్రచారకులు విజయ్‌రామ్ అన్నారు.

దీనిని రైతాంగం సరిదిద్దుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. దివాన్‌చెరువులో గోఆధారిత ప్రకృతి వ్యవసాయం పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో విజయ్‌రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూలీల సమస్యలతో ప్రస్తుతం అనేక ప్రాంతాలలో వరి కోతలకు యంత్రాలను వినియోగిస్తున్నారని, దీనివలన కూడా భూమి సున్నితత్వం దెబ్బతింటుందన్నారు. భూ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దీనిని విస్మరించి మూస పద్ధతిలో సాగు చేసుకుంటూపోతే భూతాపం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా భూ సమతుల్యతను పాటిస్తూ ఐదంచెల విధానంలో సాగు చేయడం అత్యుత్తమంగా ఉదహరించారు. ఈ విధానంలో అంతర్ పంటలు, దుంపలు వంటివి ఉంటాయన్నారు. దీని ద్వారా ఎకరాకు రూ.ఆరు లక్షల వరకు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. అలాగే చేపలు, రొయ్యల పెంపకం చేసేవారు కూడా ఆ ప్రాంతంలో ఒక ఎకరాన్ని ఐదంచెల సాగుకు వినియోగించి, సత్ఫలితాలను పొందవచ్చన్నారు. కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుతం సమయంలో ప్రకృతి సాగు ఎంతో లాభదాయకమన్నారు. దీనిపై ప్రజలను మరింత చైతన్యపరిచే దిశగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో పది వేల మంది రైతులకు అవగాహన సదస్సును నిర్వహించదలచామని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సోము వీర్రాజు, సదస్సు నిర్వాహకులు అంబటి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తరుగును తగ్గించాలి

- ఎమ్మెల్యేకు రైతుల వినతి
- ఏడీఏ సమక్షంలో రైస్ మిల్లర్లతో సమావేశం


కోరుకొండ ఏడీఏ కార్యాలయంలో రైతులు, మిల్లర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

మధురపూడి: తుపాను కారణంగా ఆందోళనలో ఉన్న రైతాంగానికి నిరాశే మిగిలింది. తడిసిన ధాన్యాన్ని మెషీన్ల ద్వారా కోసి, స్థానిక మిల్లర్లకు అమ్ముకొనేందుకు వీలులేని స్థితి వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం పలువురు రైతులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిశారు. ధాన్యం కొనుగోలులో తరుగును తగ్గించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రైస్‌మిల్లుల యజమానులు తడిసిన ధాన్యాన్ని తరుగు పేరిట 10 కేజీలు తగ్గిస్తే నష్టపోతామన్నారు. ఆరబెట్టడం కోసం 5 కేజీలు తరగు తీసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల ఇరువర్గాలతో సమావేశాన్ని నిర్వహించారు. రైస్ మిల్లుల యజమానుల సంఘం అధ్యక్షుడు వల్లేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, తడిసిన ధాన్యాన్ని రైతులు మిల్లులకు తెస్తున్నారన్నారు. దానిని ఆరబెట్టుకోవడానికి అదనపు ఖర్చులవుతున్నట్టు తెలిపారు. దీంతో మిల్లర్లు నష్టపోతారని చెప్పారు. దానికి రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, అనపర్తి ప్రాంతానికి చెందిన మిల్లు యజమానులు కేవలం 5 కేజీలు మాత్రమే తరుగు పేరిట తగ్గిస్తారన్నారు. దీంతో రైతులు తమకు అనుకూలమైన, ప్రాంతాల్లో ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఇలాఉండగా కోరుకొండ మండలంలో రబీ సీజన్ వరి కోతలను తుపాను కారణంగా రైతులు చేపడుతున్నారని, స్థానిక రైస్ మిల్లర్ల ద్వారా కొనుగోలు జరిపించాలని ఎమ్మెల్యేను కోరారు. అయితే రైతులకు సానుకూల స్పందన లభించకపోవడంతో, వారికి చేదు అనుభవం మిగిలింది.

భక్తి ప్రపత్తులతో గౌరీదేవి జాతర


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

హాజరైన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పెదపూడిలో గౌరీదేవి– సాంబశివుడు జాతర మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని అభిలషించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు, పార్టీ నాయకులు పందిరి సూరిబాబు, మార్ని పెద్దబ్బు, కాకర చందు, అందుగుల అబ్బు, తంగెళ్ల రాజు, పప్పు జానకి రామయ్య, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

డీఈఓ వాసుదేవరావు


శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులతో డీఈఓ వాసుదేవరావు

రాజానగరం: పాఠశాల విద్యలో అత్యంత కీలకంగా ఉన్న ప్రాథమిక విద్యా బోధనకు ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో అందిస్తున్న శిక్షణను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయులకు కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఇస్తున్న ఎఫ్ఎల్ఎం శిక్షణా తరగతులను బుధవారం ఆయన సందర్శించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పునాది అభ్యసనా కృత్యాలు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, పరిశీలకులు జానకి, కీ రీసోర్స్‌పర్సన్స్ వి.మహేల, ఎన్.అనిల్‌కుమార్, ప్రథమ్ సంస్థ ట్రైనీ అసోసియేట్ జగదీష్, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్వతారోహణలో పాల్గొన్న వైద్య విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

రాజానగరం: మనాలీలో అటల్ బిహారీ వాజ్‌పాయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ సంస్థ నిర్వహించిన పర్వతారోహణలో స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల విద్యార్థులు ముళ్లపూడి చైతన్యరాజ్, కెన్నీటి హర్ష పాల్గొన్నారు. సాహసోపేతమైన ఈ పర్వతారోహణకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన 90 మంది విద్యార్థులలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ఇద్దరితో పాటు, 10 మంది ఉన్నారు. వీరిలో చైతన్యరాజ్ దేశ వ్యాప్తంగా ఉన్న రోప్ లీడర్లు, వలంటీర్లకు నాయకత్వం వహించి, 'కోర్సు సీనియర్' హోదాను అందుకున్నాడు. క్లైంబింగ్, రాపెల్లింగ్, రివర్ క్రాసింగ్ మొదలైనవి కూడా మౌంటనీరింగ్ అడ్వెంచర్‌లో ఉంటాయి. ఈ సందర్భంగా కళాశాల చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఎండీ డాక్టర్ గన్ని సందీప్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే మిశ్రా, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వాణీ మాధవి సాహసోపేత యాత్ర చేసిన విద్యార్థులను అభినందించారు.

పురుషోత్తపట్నంలో వన సమారాధన

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం లో కార్తిక మాసం సందర్భంగా వన సమారాధన ఘనంగా నిర్వహించారు. బుధవారం పురుషోత్తపట్నం రామాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్తిక మాస భోజనాల్లో సుమారు 1,500 మంది పాల్గొన్నారు.

వేగవంతంగా దాళ్వా వరి నాట్లు


రాపాకలో దాళ్వా వరి నాట్లు వేయడానికి సిద్ధం చేసిన పొలం

సీతానగరం: మండలంలో దాళ్వా వరినాట్లు వేగవంతంగా సాగుతున్నాయి. దాళ్వా సీజన్‌లో వేసే వరి నాట్లు ఊపందుకున్నాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 18 వేల ఎకరాల్లో వరి సాగు కాగా, తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్‌లో సాగయ్యేది 14 వేల ఎకరాలు ఉంటుంది. మిగిలినది వర్షాధారంపై ఆధారపడింది. అయితే జులై, ఆగస్టు నెలల్లో అధిక వర్షాలతో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ముంపునకు గురై, వరినాట్లు కుళ్లిపోవడంతో రైతులు రెండోసారి వరి నాట్లు వేశారు. అనంతరం తుపాను ప్రభావంతో రెండోసారి ముంపునకు గురికావడంతో, మూడోసారి వరినాట్లు వేసిన పొలాలున్నాయి. సుమారు మూడు వేల ఎకరాలు ముంపు నుంచి తేరుకోకపోవడంతో, దాళ్వా సీజన్‌లో నేరుగా వరినాట్లు వేయడం రైతులు ప్రారంభించారు. వరి ఆకుమడులు నాట్లకు సిద్ధం కావడంతో, మండలంలో దాళ్వా వరిపంట సుమారు నాలుగు వేల ఎకరాలకు పైగా ఉండవచ్చని అంచనా. మిగిలిన పొలాల్లో మొక్కజొన్న, వర్జీనియా పొగాకు, కూరగాయల పంటలను రైతులు వేస్తున్నారు. ముంపు నుంచి బయటపడిన పొలాల్లో దాళ్వా వరినాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాధవరావు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే పొలాల్లో రసాయన ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. బుధవారం రాజవోలు గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు అధ్యక్షతన క్షేత్ర స్థాయిలో నిర్వహించిన పొలంబడి రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంటకు కావలసిన ముఖ్యమైన పోషకాలను క్షుణ్ణంగా వివరించారు. శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ, వరిలో సమగ్ర సస్య రక్షణ, విత్తనం ఎంపిక చేసుకునే విధివిధానాలు, ఎరువులు, నీటి, కలుపు మందుల యాజమాన్యం తదితర అంశాలను విశదీకరించారు. రాజమహేంద్రవరం రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం వరిపంటలో ప్రకృతి వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం వలన వరి పంటకు తెగుళ్లు, పురుగుల ను తట్టుకునే శక్తి చేకూరుతుందన్నారు. అధిక దిగుబడికి ఇదెంతో అవసరమని తెలిపారు. ఏరిస్ ప్రతినిధి రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన స్టాళ్లు, ప్రదర్శించిన ఉత్పత్తులను రైతులకు వివరించారు. రాజమండ్రి సబ్ డివిజన్ మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

మండల ప్రత్యేక అధికారి వరప్రసాద్


బాల్య వివాహాల నిర్మూలనకు ర్యాలీ చేస్తున్న అధికారులు

పెదపూడి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి వరప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడానికి అంతా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు చేస్తున్న సర్వేను ఈ నెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలో మంజూరైన 50 గోశాలల షెడ్డు నిర్మాణ పనులు పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(సీఆర్ఏఎఫ్) ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నిరోధించాలని, బాలల హక్కులు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్ఏఎఫ్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ సతీష్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ, ఎంఈఓ–1,2లు కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, వెలుగు ఏపీఎం చినబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


కరకుదురులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ మణిదీప్

పెదపూడి: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండి పండించిన ధాన్యాన్ని కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్.మణిదీప్ సూచించారు. దోమాడ, కరకుదురు గ్రామాల్లోని పొలాల్లో బుధవారం ఆయన పర్యటించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు. ఈ కారణంగా రైతులు వరి కోతలు రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని సూచనలు చేశారు.